నమస్తే తెలంగాణ

# నల్లగొండ

5 | నల్లగొండ, సోమవారం 9 జూన్ 2025 | NALGONDA



మల్లాపురంలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు

## మల్లాపురంలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలి

### రిలే నిరాహార దీక్షలో బీఆర్‌ఎస్ యువజన, విద్యార్థి విభాగం నాయకుల డిమాండ్

యాదగిరిగుట్ట, జూన్ 8: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మల్లాపురం గ్రామానికి మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలతోపాటు వందపడకల దవాఖానను వెంటనే నిర్మించాలని బీఆర్‌ఎస్ యువజన, విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మల్లాపురంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఉదయం దీక్షను బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా యువజన, విద్యార్థి విభాగం నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ 2023 సెప్టెంబర్ 18న రూ.183 కోట్ల నిధులు కేటాయిస్తూ జీవో 85 విడుదల చేశారన్నారు. 8 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లను కలుపుకొని 433 మంది వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందిని నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు. అప్పట్లో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి పేరుతో మంజూరైన వైద్య కళాశాలను గుట్టకు కూతవేటు దూరంలో ఉన్న మల్లాపురంలోని సర్వే నంబర్ 84లో 200 ఎకరాల ప్రభుత్వ భూమిలో నిర్మించాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదన్నారు. గతంలో కలెక్టర్లు, వైద్యాశాఖ అధికారులు సైతం భూమిని పరిశీలించి, గుర్తించారని తెలిపారు. గత శుక్రవారం తిరుమలాపూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైద్య కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసినా ఇప్పటివరకు ఎక్కడ నిర్మిస్తారో స్పష్టత ఇవ్వలేదన్నారు. యాదగిరిగుట్టలో అనువైన భవనాలు ఉన్నా 2024–25 విద్యా సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులను భువనగిరిలో కొనసాగించడంపై అనుమానం కలుగుతుందన్నారు. మల్లాపురంలో కళాశాల ఏర్పాటు చేయడం స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఇష్టంలేనట్లుగా కనిపిస్తున్నదన్నారు. దీంతో మల్లాపురం గ్రామానికి చెందిన ఎంతో మంది యువత ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు స్పందించి ఎమ్మెల్యేను ఒప్పించి గ్రామంలోనే వైద్య కళాశాల ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. లేకపోతే చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. దాతారుపల్లి గ్రామంలో 152,153,156,157 నంబర్లలో నిర్మిస్తున్నట్లు సమాచారం వస్తున్నదన్నారు. ఇదే జరిగితే మల్లాపురం గ్రామానికి తీరని అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పునరాలోచన చేసి మల్లాపురంలో వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో పనులు ప్రారంభించేంతవరకు రిలే నిరాహార దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఒగ్గు మల్లేశ్, విద్యార్థి విభాగం మండల నాయకుడు మోటె శేఖర్, నాయకులు కర్రె చంద్రశేఖర్, దుద్దురు సిద్ధులు, పుచ్చుల నర్సింహులు, బరిగె రాజు, ఓరుగంటి శ్రీధర్, కర్రె మధు, ఇండ్ల ప్రసాద్, దేవరుప్పల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై ఫైర్‌స్టేషన్ కానిస్టేబుల్ వీరంగం

### పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

మోత్కూరు, జూన్ 8: మహిళపై ఫైర్‌స్టేషన్ కానిస్టేబుల్ వీరంగం సృష్టించిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని అనాజిపురంలో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం..మండలంలోని అనాజిపురానికి చెంది న ఇరుకుల సంతోషలక్ష్మి కిరాణంతోపాటు బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నారు. మోత్కూరు ఫైర్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మలిపెద్ది మహేందర్‌రెడ్డి శనివారం రాత్రి 10.30 గంటలకు సంతోషలక్ష్మి ఇంటికెళ్లి, తాను పోలీస్‌నని తానెప్పుడు వచ్చి బీర్లు అడిగినా ఇవ్వాలన్నారు. అప్పటికే ఇంట్లో గడియ పెట్టుకుని సంతోషలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి పడుకున్నారు. బీర్లు ఇవ్వకపోతే నీ సంగతి తేలుస్తానంటూ తలుపులు తన్నుతూ బెదిరింపులకు దిగాడు. తలుపు తీసిన సంతోషలక్ష్మి భర్త సంతోష్‌పై దాడి చేసి కొట్టడంతోపాటు తనపట్ల కూడా అసభ్యంగా ప్రవర్తించాడని, ఇంట్లోకి వచ్చి లైట్లు పగులకొట్టాడని సంతోషలక్ష్మి తెలిపారు. విషయాన్ని ఇంటి పక్కనున్న మారెడ్డి భాస్కర్‌రెడ్డికి చెప్పడంతో ఆయన వచ్చి మహేందర్‌రెడ్డిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆయనపై కూడా దాడి చేయడంతో తీవ్ర గాయమై రక్త స్రావమైంది. అడ్డువచ్చిన బాధితురాలు సంతోషలక్ష్మిపై కూడా చేయి చేసుకున్నాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

● మృగశిర సందడి



మృగశిర కార్తె సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో చేపలు కొనుగోలు చేసేందుకు బారులుదీరిన జనం

# బడి బస్సు భద్రమేనా?

## యాదాద్రి భువనగిరి జిల్లాలో 378 బస్సులకు 229 కి పరీక్షలు పూర్తి

### కండిషన్‌లో లేని వాహనాలు వెనక్కి పంపాలని నిర్ణయం

### ఫిట్‌నెస్ పరీక్షలు లేకుండానే నడిపిస్తున్న బస్సులు

### విద్యార్థుల సంరక్షణ బాధ్యత పాఠశాలల యాజమాన్యాలదే..

ఈ ఏడాది విద్యా సంవత్సర ప్రారంభ సమయం దగ్గర పడుతున్నది. ఈలోగా విద్యార్థుల రవాణాకు ఉపయోగించే ప్రైవేట్ పాఠశాలల బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి, ఆర్టీఏ అధికారుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి గతనెల 15వ తేదీతో బడి బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు ముగిసింది. గడువు దాటినా జిల్లాలో సగం పాఠశాలల యాజమాన్యాలు ఇంకా బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించలేదు. ఈ మేరకు జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయంలో పరీక్షలు కొనసాగుతున్నా యాజమాన్యాలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.




మోత్కూరు, జూన్ 8: ఆర్టీఏ అధికారులు సంబంధిత యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. గత విద్యా సంవత్సరం యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించకుండానే కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బస్సులు నడిపాయి. ఈ సారైనా అధికారుల కఠినంగా వ్యవహరిస్తేనే పూర్తిస్థాయిలో పరీక్షలు చేయించుకునే అవకాశం ఉన్నది. జిల్లాలో 378 బస్సులు ఉండగా ఇందులో 229 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు గురువారం నాటికి పూర్తి చేసుకోగా ఇంకా 149బస్సులు పరీక్షలు చేసుకోవాల్సి ఉన్నది. ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్ విషయంలో కొందరు అధికారులు ఉదాసీనంగా, ఏజెంట్లు చెప్పినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### 150 బస్సులు.. ఫిట్‌నెస్ పరీక్షలకు దూరం..

గతేడాదిలో జిల్లాలో దాదాపు 150 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేసుకోకుండానే విద్యార్థులను తరలించారని తెలుస్తున్నది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అర్హత పత్రాలు తీసుకోవాల్సిన కొన్ని యాజమాన్యాలు వాహనాల రిపేరు ఇతర కారణాలతో ఫిట్‌నెస్ పరీక్షలు చేయించలేదు. విద్యా సంస్థల బస్సులన్నీ నిబంధనల ప్రకారం వసతులు కల్పించి ఫిట్‌నెస్ పరీక్షలు చేయించి విద్యార్థుల సంరక్షణ బాధ్యత తమదేనంటూ పాఠశాలల యాజమాన్యాలు రవాణా శాఖకు హామీ పత్రం సమర్పించాలి.



స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్ష పత్రాలు పరిశీలిస్తున్న సాయికృష్ణ

### వాహనదారులు పాటించాల్సిన నియమాలు..

విద్యా సంస్థల బస్సులకు ప్రభుత్వం ప్రత్యేకంగా పసుపు రంగు గుర్తు కేటాయించింది. ఈ స్కూల్ బస్సుపై, కళాశాల/ పాఠశాల పేరు, ఫోన్, సెల్ నెంబర్ తోపాటు పూర్తి చిరునామా బస్సు ఎడమ వైపు, ముందు భాగంలో స్పష్టంగా కనిపించేలా చేయాలి. ఏడాదిన్నర క్రితం 185వ చట్టం క్లాజ్(ఎఫ్), క్లాజ్ (జి) ప్రకారం విద్యా సంస్థల బస్సుల కోసం అదనపు నిబంధనలు జోడించారు.

60 ఏండ్లు దాటిన వ్యక్తిని డ్రైవర్‌గా నియమించుకోరాదు. పాఠశాల యాజమాన్యాలు బస్సు డ్రైవర్, బస్సుకు చెందిన పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. బస్సులో ఒక అత్యవసర ద్వారం ఉండాలి. దానిపై పెద్ద అక్షరాలతో అత్యవసర ద్వారం అని రాయాలి.

### కల్పించాల్సిన వసతులు...

ప్రతి స్కూల్ బస్సులో అవసరమైన మందులు, పరికరాలతో కూడిన ప్రథమ చికిత్స పెట్టె ఉండాలి. బస్సులో తప్పకుండా యూనిఫాం ధరించిన ఒక అటెండర్‌ను ఉంచాలి. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల పూర్తి వివరాలు, విద్యార్థి ఎక్కాల్సిన, దిగాల్సిన ప్రదేశాలు నమోదు చేయాలి. బస్సులో ఉన్న విద్యార్థులు కిందికి దిగే సమయంలో డ్రైవర్‌కు వారు కనిపించేలా సైడ్ మిర్రర్ ఏర్పాటు చేయాలి. తయారీ సంవత్సరం నుంచి 15 సంవత్సరాలు మించరాదు.

ప్రతి బస్సుకూ చేతి బ్రేక్, పూర్తి స్థాయిలో బీమా, రవాణా పన్ను చెల్లించి ఉండాలి. బస్సు అద్దాలకు ఆనుకుని అడ్డంగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. నాణ్యమైన ఇంజిన్, స్టీరింగ్, రూఫ్, టైర్లు, తదితర ప్రభుత్వం గుర్తించిన పూర్తి సౌకర్యాలు కల్పించాలి. విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా తక్కువ ఎత్తులో సీట్లు బిగించాల్సి ఉన్నది.

> **ఫిట్‌నెస్ చేయించుకోని బస్సులు సీజ్ చేస్తాం..**
>
> ఫిట్ నెస్ పరీక్షలు లేకుండా పాఠశాలల బస్సులు రోడ్ల మీద తిరిగినా, విద్యార్థులను తరలించినా.. అలాంటి బస్సులను ఈనెల 15వ తేదీ నుంచి సీజ్ చేస్తాం. సీట్ల సంఖ్యకు మించి విద్యార్థులను తరలించినా, పూర్తి స్థాయి వసతులు కల్పించకపోయినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.
>
> **- సాయికృష్ణ, డీటీవో**

## తొలిరోజు సజావుగా 'టీజీఐసెట్'

- ఎంజీయూలో కీ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి
- నల్లగొండ పరీక్ష కేంద్రాలు పరిశీలించిన సెట్ చైర్మన్, వీసీ ప్రొ. ఖాజా అల్తాఫ్ హుస్సేన్
- రాష్ట్ర వ్యాప్తంగా 44,033 మంది, నల్లగొండలో 338మంది విద్యార్థుల హాజరు

రామగిరి, జూన్ 8: రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన 'టీజీఐసెట్'-2025 ప్రవేశ పరీక్ష నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో నిర్వహిస్తుండగా తొలి రోజు సజావుగా ముగిసింది. ఉదయం జరగాల్సిన ప్రశ్నపత్రం కీని ఎంజీయూ ఆర్ట్స్ బ్లాక్ సమావేశ మందిరంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి, మధ్యాహ్నం జరగాల్సిన పరీక్షల కీని ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొ.ఇటికాల పురుషోత్తంరెడ్డి, సెట్ చైర్మన్, ఎంజీయూ వీసీ ప్రొ.ఖాజా అల్తాఫ్ హుస్సేన్, కన్వీనర్, ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొ.అల్వాల రవిలతో కలిసి ఉదయం, మధ్యాహ్నం వేర్వేరుగా పరీక్ష సమయం కంటే ముందుగా విడుదల చేశారు. తొలిరోజు 48,660 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 44,033 మంది హాజరు కాగా 4,627మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. షిఫ్ట్ -1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు 93 పరీక్ష కేంద్రాల్లో 24,330మంది అభ్యర్థులకు 21,897మంది విద్యార్థులు హాజరుకాగా 90 శాతం హాజరు నమోదైంది. షిఫ్ట్ -2 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు 91 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 24,330 మందికి 22,136మంది హాజరయ్యారు. 90.98శాతం హాజరునమోదైనట్లు టీజీ ఐసెట్ కన్వీనర్ ప్రొ. అల్వాల రవి వెల్లడించారు. సోమవారం ఉదయం షిఫ్ట్ -3తో పరీక్ష ముగుస్తుంది. ఎంజీయూలో ఏర్పాటు చేసిన కమాండింగ్ సెంటర్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 93 పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షల నిర్వహణ తీరును సెట్ కన్వీనర్ ప్రొ. అల్వాల రవి సమీక్ష నిర్వహించి ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, పరిశీలకులను సయాయత్తం చేశారు. ఈ పరీక్షల నిర్వహణలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొ. శ్రీరామ్ వెంకటేశ్, సాంకేతిక నిపుణులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాన్ని ఎంజీయూ వీసీ, సెట్ చైర్మన్ ప్రొ. ఖాజా అల్తాఫ్ హుస్సేన్, హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. బాలకృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.



నల్లగొండలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెట్ చైర్మన్, వీసీ ప్రొ. ఖాజా అల్తాఫ్ హుస్సేన్

## పిడుగుపాటుతో మహిళా రైతు మృతి

నల్లగొండ సిటీ జూన్ 8: కనగల్ మండలం కురుమర్తిలో పిడుగు పడి మహిళా రైతు మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి సత్తమ్మ (45) బర్రెలు మేపేందుకు గ్రామ చెరువు వద్దకు వెళ్లి సాయంత్రం వానపడుతుండగా తిరిగి బర్రెలను తోలుకుని ఇంటికి వస్తున్నది. ఆ సమయంలో ఎస్ఎల్‌బీసీ కాల్వ దగ్గరలో ఆమెకు 30 మీటర్ల దూరంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పిడుగుపాటుతో మృతురాలి కుడి భుజం నుంచి ఛాతి వరకు కాలిన గాయాలు ఉన్నాయని మృతురాలి కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఎస్ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

## వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం

యాదగిరిగుట్ట, జూన్ 8: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంతోపాటు అనుబంధ పాతగుట్ట(పూర్వగిరి) ఆలయంలో ఆదివారం స్వాతీ నక్షత్ర పూజలు ఘనంగా జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతీ నక్షత్రం సందర్భంగా వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో 108 కలశాలు ఏర్పాటు చేసి గంగాది సప్తనదీ జలాలు, మామిడి, తమలపాకులు, దర్భలు, పూలమాలలు, కొబ్బరికాయలతో అలంకరించారు. పంచామృతాలతో పాటు సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. ఆయా దేవతల మూలమంత్ర పఠనాలతో హోమ పూజలు నిర్వహించారు. ప్రధానాలయంలోని స్వయంభూ పంచనారసింహస్వామి, సువర్ణప్రతిష్ఠ అలంకారమూర్తులను వేదమంత్రాలతో అష్టోత్తర శతఘటాభిషేక పూజలు నిర్వహించి సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్రం జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా స్వామివారిని దివ్యమనోహరంగా అలంకరించి పూజలు జరిపారు. తెల్లవారుజాము నుంచే భక్తులు గిరిప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. గిరిప్రదక్షిణలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. స్వామివారి ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొన్నది. వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మాఢవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలు, బస్టాండ్ ప్రాంతం భక్తులతో నిండిపోయింది. కొండపైన, కింద పార్కింగ్‌లో వాహనాలు నిండిపోయాయి. సీసీ కెమెరాల పనితీరు ఆలయ ఈవో వెంకట్రావ్ పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలను మానిటరింగ్ సిస్టంలో పరిశీలించి ఆలయ, పోలీసులకు సూచనలు చేశారు.



అష్టోత్తర కలశాలను సిద్ధం చేసిన అర్చకులు

## ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి



నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను సన్మానిస్తున్న నాయకులు

రామన్నపేట, జూన్ 8: ప్రజలు ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఆదివారం మండలంలోని బోగారంలో బొడ్రాయి, ఎల్లమ్మ పండుగల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోశబోయిన మల్లేశం, మాజీ సర్పంచ్‌లు అంతటి పద్మారమేశ్, ఎడ్ల మహేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమారమేశ్, బీఆర్‌ఎస్‌వై మండల అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్, నాయకులు కూనూరు శ్రీనివాస్, ఎడ్ల నరేందర్‌రెడ్డి, రేఖ యాదయ్య, మేడి రామలింగం, బొడ్డుపల్లి రాజు, ఆవుల శ్రీధర్, మేడి కృష్ణ, బొడ్డు అల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాలకు హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

## వైభవంగా మహాకుంభాభిషేకం

చిట్యాల, జూన్ 8: మండలంలోని ఉరుమడ్లలో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మహా కుంభాభిషేకం, పూర్ణాహుతిని వేదపండితుల మంత్రోచ్ఛారణాలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహిళలు పార్వతీరామలింగేశ్వర స్వామికి బోనాలు సమర్పించారు. కంచర్ల కృష్ణారెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలను చెన్నై, తెలంగాణ నుంచి వచ్చిన 51మంది రుత్వికుల వేదమంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల చివరిరోజు పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, గ్రామ దేవతలకు బోనాలు, సాయంత్రం పార్వతీ రామలింగేశ్వర స్వామి శాంతి కల్యాణం జరిగాయి. మృగశిర కార్తె కూడా కలిసి రావడంతో గ్రామంలోని ప్రతి ఒక్క కుటుంబం బంధువులను పిలుచుకుని వేడుకలు చేసుకున్నారు. ఊరంతా బంధువులు, మిత్రులతో సందడిగా కనిపించింది. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి సోమ భరత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, జడ్పీ మాజీ చైర్మన్లు బండా నరేందర్ రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు నలగాటి ప్రసన్నరాజ్, చకిలం అనిల్ కుమార్, వెంకటేశ్వర్లు, గోలి అమరేందర్ రెడ్డి, బీజేపీ నాయకులు బండారు ప్రసాద్, మాదగోని శ్రీనివాస్ గౌడ్‌లతోపాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు రాజకీయాలకతీతంగా పాల్గొన్నారు.